# ఎదురుచూసినది...?

రాజేశ్వరికోసం నిరీక్షిస్తూ కేశవ్ లేడీస్‌హాస్టల్ విజిటర్స్ రూమ్‌లో కూర్చున్నాడు. ఊరికే కూర్చుంటే అతనికి అనేక రకాలైన ఆలోచనలు వస్తుంటాయి. కొంతమంది అమ్మాయిలు తమకోసం వచ్చిన వాళ్లతో మాట్లాడు తున్నారు. సాయంత్రమవటం చేత కొంతమంది గాలిలో తిరుగుతున్నారు. కేశవ్ అకస్మాత్తుగా అమ్మాయిలను గురించి ఆలోచనలో పడ్డాడు. అతడిని కదిలించింది వాళ్ళ అందాలు, నవ్వులు కాదు. ఈనాటి చదువులు, నాగరికతలను ఆధారం చేసుకున్న పరిస్థితులు.

''ఎంత అసహజంగా బ్రతుకుతున్నాము!... ఈనాటి స్త్రీలు, పురుషులు కూడా. ఒక్కొక్క కాలధర్మం ఆవిధంగా నడిపిస్తుంది. పూర్వీకులు స్త్రీలను గృహానికే అంకితం చేశారెందుకు? విజ్ఞానం అపారమైనది. కనుక అసంతృప్తికి దారితీస్తుంది. గృహిణి అయిన స్త్రీ విద్యావంతురాలు అయితే పురుషుడితో సమానంగా అన్వేషణలో మునిగి తన బాధ్యతలు నిర్వహించలేకపోతే కుటుంబ వ్యవస్థయొక్క శాంతి క్షేమాలకి భంగం వాటిల్లుతుందేమో! గ్రీకుల కళా శిఖరావాసానికి బానిసలు సోపానాలైనట్టు మన స్త్రీలు హిందూ నాగరికతకు తోడ్పడ్డారు కాబోలు. ఆ రకంగా కొంతమంది కళాజీవులు, జ్ఞానతృష్ణ గలవారు. ఆత్మహింసకి గురియై ఉంటారు. కాని సామాన్యంగా స్త్రీ యొక్క ప్రకృతి, స్వభావం గృహజీవనానికి అనుగుణంగా సృష్టించబడి ఉండాలి. ఇది అర్థం చేసుకోటానికి నేటి పరిస్థితులు ఆడవాళ్ళకు చక్కని అవకాశం. ఇప్పుడిప్పుడే స్త్రీలు స్వతంత్ర్యాన్ని కొంచెం రుచి చూస్తున్నారు.....''

''చాలా ఆలశ్యం చేశానా మామయ్యా?'' అంది ఇంకొక కుర్చీలో కూర్చుంటూ రాజేశ్వరి. కేశవ్ చూశాడు. రాజేశ్వరి వచ్చింది. తెల్ల జార్జెట్ చీర,

తెలుపు పాప్లిన్ చోళీ వేసుకుని చాలా నీట్‌గా ఉంది. పెదవులమీద నవ్వుఉన్నా కళ్లలో నీడలా ఏదో దిగులు వ్యాపించింది.

''ఏవో ఆలోచనలు వస్తుంటే పది నిముషాలు గడిచాయని కూడా తెలియలేదు. రాజీ'' అన్నాడు. ఒక్కసారిగా రాజేశ్వరి కేశవ్ ముఖంలోకి చూసింది.

''నేను చాలాసార్లు అనుకున్నాను మామయ్యా, రాజి అని పిలవమని చెప్పాలని. నా ఫ్రెండ్స్ కూడా నన్ను ఇంట్లో అందరూ పిలిచినట్లే రాజు అనే పిలుస్తారు. ఈమధ్య ఆ పేరు నాకెందుకనో జుగుప్స కలిగిస్తోంది. నువ్వు రాజీ అని పిలిస్తే ఎంతో హాయిగా అనిపించింది. అట్లా పిలిపించుకోవాలని ఉందని నీకెప్పుడైనా చెప్పానా, నాకు గుర్తులేదు'' అంది.

కేశవ్ నవ్వాడు. అతడు రాజేశ్వరికంటె పదేళ్లు పెద్దవాడు. ఆ నవ్వులో ఆప్యాయత, వాత్సల్యం ఉన్నాయి. అతని మాటలలో, చూపులలో నిదానం ఉట్టిపడుతూంటుంది. చేతులు టేబుల్‌కు ఆనించి.... పెట్టాడు.

''అక్కయ్యకి నువ్వే ప్రథమ సంతానం. నువ్వు పుట్టే ముందర మీనాన్న కొడుకు పుట్టాలి'' అన్నాడు. నువ్వు పుట్టగానే మీ అమ్మ 'ఆడపిల్లా' అని ముఖం తిప్పేసుకుంది. తరవాత నీకు అబ్బాయి చొక్కాలు తొడిగేది. నిన్ను రాజూ అని పిలిచేది. షర్టు, నిక్కరువేసి క్రాప్ చేయించేది. గోలీలాడటం, చెట్లెక్కడం, గోడలు దూకటం నీకు గుర్తు ఉంటాయి. నిన్ను చూస్తుంటే నాతో సైకిల్ పందాలువేసిన రాజూ ఏనా అనిపిస్తుంది'' అన్నాడు.

''ఊహు. రాజు అనొద్దు మామాయ్యా'' అంది కొంచెం అలుకగా. రాజేశ్వరిని అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ ఆమె ముఖంలోకి చూశాడు కేశవ్. రాజేశ్వరి బల్లమీద ఆన్చిన తన చేతులకేసి చూపులు ప్రసరిస్తూ అమ్మ కోరిక నెరవేర్చాలని, అంత పట్టుదలతో మెడిసిన్‌లో చేరానా, ఇప్పుడు ఈ రెండేళ్లు లేని దిగులు ఏదో వేధిస్తోంది మామయ్యా. నాకేం తక్కువ! ఇంట్లో చదువుకోడానికి వీలుగా ఉండదు, కాలేజీ దూరమనీ అనుకుంటే హాస్టల్‌లో జేర్పించాడు నాన్న. నాకు మార్కులు కూడా బాగానే వస్తాయి. ఎందుకో దిగులు నాకేం అర్థం కాదు'' అంది. రాజేశ్వరి సన్నగా ఉంటుంది. ఎక్కువ పొడుగుకాదు. కళ్ళు పెద్దవి. చిన్నపిల్లలా అమాయకంగా కనిపించే ముఖం. రాజేశ్వరి మీద జాలివేసిందతనికి.

''మొన్న ఒకరోజు బీచ్‌కి వెళ్లాను. కెరటాలు చంద్రుడిని అందుకోటానికి తహతహలాడుతున్నాయని వర్ణిస్తారు కవులు. నాకేమనిపించిందో తెలుసా! ఈ

అల్లరిపిల్ల ఆకాశరాజులాగ ఉండాలని ఎగురుతూ వృధాప్రయత్నం చేస్తోందని. కాని సముద్రము, ఆకాశము - దేనిలో ఉండే గాంభీర్యమూ, అందము విడి విడిగా రెండింటిలోనూ ఉన్నాయి కదూ'' అన్నాడు.

''సముద్రాన్ని అల్లరిపిల్లతో పోల్చావా'' అంటూ రాజేశ్వరి నవ్వేసింది. నా మాటలు అర్థం చేసుకోలేదు అనుకున్నాడు కేశవ్. అతడి పెదవులమీద నవ్వు అణిగిపోయింది. తరువాత కులాసా కబుర్లు అయ్యాక అతను వెళ్లిపోయాడు.

* * *

రాజు ఎందుకు దిగులుగా ఉంటోంది! ఇది కేశవ్ ఆలోచన.

''రాజు ఎందుకో దిగులుగా కనిపిస్తోంది అక్కయ్యా'' అన్నాడు కమలమ్మతో.

''పరీక్షలకి చదువుతోందేమో! అయినా ఈమధ్య దానిని చూస్తే దానికి చదువు ఆపించి పెళ్లి చేస్తే నయమేమో అనిపిస్తోంది. ఏమి మనషులమో, ఒక అభిప్రాయం పెట్టుకోటానికి వీలులేదు. అది నెరవేరుతుందని లేదు. మెడికల్ స్టూడెంట్స్ దాని తోటివాళ్లెంత సరదాగా తిరుగుతారు! దాని కళ్లలో దిగులు నాకూ కనిపించింది. దసరాలకి అక్క వచ్చిందని ఉష ఎంత సరదాపడింది. అదేమో సినిమాకి రమ్మన్నా కదలదు. పేరంటాళ్ళు వచ్చినా రాదు. ఆ మేడగదిలో కుర్చీ వేసుకుని చేతిలో ఒక నవల, ఎక్కడో చూపులు. దీనిని బలవంతంగా చదివిస్తున్నామా అనిపించింది''.

''నాకూ అట్లాగే అనిపించింది'' అన్నాడు కేశవ్. కొంచెంసేపు ఊరుకుని కమలమ్మ, ''ఆదివారం తప్పకుండా ఇంటికి రమ్మని చెప్పు. ప్రసాద్ వాళ్ల వాళ్లకి కబురుచేశాము. నువ్వు వెళ్లినప్పుడు రాజుతో మళ్ళీ ఒకమాటు చెప్పు. అది అతనంటే కొంచెం ఇష్టం చూపిస్తోంది. పోనీ కుదిరితే పెళ్ళి చేస్తాము. పిల్లల సంతోషంకంటేనా, నా అభిలాష! అది డాక్టర్ కావాలని ఎన్నో కలలు కన్నాను. దానికిష్టంలేని భారం నెత్తిన వెయ్యటం అన్యాయమవుతుంది.

''కొడుకులాగ పెంచావుకాని, కొడుకును కానని గుర్తుచేస్తోంది. అంతే అక్కయ్యా!'' అన్నాడు కేశవ్ నవ్వుతూ.

* * *

''మీ అమ్మ నిన్ను ఆదివారం తప్పకుండా రమ్మని చెప్పింది. తెలుసుకదూ, ప్రసాద్ వాళ్ళు నిన్ను చూడటానికి వస్తారుట'' అన్నాడు. రాజేశ్వరి సిగ్గుపడింది.

''అతను, వాళ్ళ చెల్లెలు ప్రమీల ఇవేళ ఇక్కడికి వస్తున్నారు. నువ్వెప్పుడైనా అతడిని చూశావా?'' కళ్ళతో ప్రశ్నిస్తూ అడిగింది.

''శనివారం సినిమాదగ్గర నువ్వు, సరోజా మాట్లాడుతున్నది అతని తోటేనా?'' అన్నాడు. రాజేశ్వరి తన చూపులను మళ్లించుకుంది.''

''మాటినీషోకి నువ్వూ వచ్చావా మామయ్యా! ఔను. సరదాగా ఉంటాడు. అదిగో వస్తున్నారు'' అంది. ప్రమీల, ప్రసాద్ వచ్చి ఇంకో రెండు కుర్చీలు ఆక్రమించుకున్నారు. కేశవ్ ప్రసాద్ మాటల్నీ, కదలికల్నీ గమనిస్తున్నాడు. రాజేశ్వరి ప్రసాద్‌వైపు చూసినప్పుడు ఆమె బుగ్గలు ఎర్రపడటం, కళ్ళలోకి కాంతి రావటం అతను చూశాడు. ఇతనిలో ఏమి చూసి రాజేశ్వరి ముగ్ధురాలవుతున్నది అని అతడు నవ్వుకున్నాడు. వాళ్ళు వెళ్ళిపోయాక, ''ప్రసాద్ నిన్న సినిమాలో ఉమాబాలతో కనిపించాడు. అతనికి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నట్లున్నారే'' అన్నాడు.

రాజేశ్వరి తన ముఖంలోని భావాలేమీ కనపడకుండా ప్రయత్నం చేస్తూ -

''అతను చాలా సరదాగా ఉంటాడని చెప్పాను కదూ మామయ్యా'' అంది.

''ఒకసారి ట్రైన్‌లో నేను, అతనూ ఒకే కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాము. బెడ్డింగ్, సూట్‌కేస్ తీసుకువస్తూ ఎదురుగా వచ్చే ఐదేళ్ల పిల్లని తోసేశాడు. ఒకావిడ బెడ్డింగ్ వేసుకుని పడుకుంది. చోటు చెయ్యమన్నాడు. ఆవిడ ఒప్పుకోలేదు. ఆవిడతో వాదనకి దిగాడు. ఎంత తొందరపాటు!

''ప్రతిమనిషికీ ఏవో బలహీనతలు ఉంటాయి. కదు మామయ్యా!''

''శంకర్ చెప్పాడు. ప్రమీల స్నేహితురాండ్రందరితోటి అతను సరదాగా కబుర్లు చెప్తాడుట. కాని తన చెల్లెల్ని తన స్నేహితులెవరితోటి మాట్లాడ నీయడుట. ప్రమీల చదువుకోవటం అతడికేమీ ఇష్టంలేదుట''

''నా మటుకు నాకు ఈ చదువులకు అర్థం లేదనిపిస్తుంది. ఇంక నేను చదవలేననిపిస్తోంది మామయ్యా, ఈమధ్య'' అంది భారంగా.

''శంకర్, ప్రసాద్ చాలా స్నేహంగా ఉంటారని నీకు తెలుసను కుంటాను. ఎక్కడికి వెళ్ళినా, సినిమాలకి, షాపింగ్‌కి, ప్రతిచోటకూ శంకర్‌ని బలవంతంగా నైనా లాక్కుపోతాడట ప్రసాద్. ఈమధ్య శంకర్‌కి మలేరియా వచ్చింది. రూమ్‌మేట్ కదా! జ్వరంగా ఉందా, అయితే క్లాస్‌కి రావా అని వెళ్ళిపోయాడట'' అన్నాడు కేశవ్. రాజేశ్వరి ముఖంమీదే అతడి చూపులు కేంద్రీకృతమయి

ఉన్నాయి. రాజేశ్వరి అట్లాగే తలవంచుకుని బల్లమీద వేళ్ళతో మీటుతూ కొంచెంసేపు మాట్లాడకుండా కూర్చుంది.

''నేననుకుంటాను మామయ్యా, చిన్నతనంలో విన్నవీ, చదివినవీ కథలూ, కబుర్లూ మనకేదో ఆదర్శాలు, వూహాగానాలు కల్పిస్తాయి. దేశసేవ, ప్రేమ వివాహం ఇటువంటి ఉద్దేశాలెన్నో కలుగుతాయి. అప్పుడు బ్రతుకెంతో తీయగా, మహోత్తమంగా, ఉత్సాహపూరితంగా ఉంటుంది. కాని టీన్స్ గడుస్తూ, యధార్థాలని అర్థం చేసుకుంటుంటే ఇవన్నీ భ్రమలు, జీవితం ఎడారివంటిది అనిపిస్తుంది. ఇటువంటి జీవితానికి నియమాలేమిటి? ఇంత గాంభీర్యమెందుకు? అల్పాయుష్కు రాలయిన ఈ జీవితంలో సిద్ధాంతాలనీ, ఆశయాలనీ పెట్టుకుని ఆనందాన్ని దూరం చేసుకోవటం కాలాన్ని వ్యర్థం చేయటం కాదా! నాకు రిస్సరెక్షన్ నవల గుర్తు వస్తుంది. ఇప్పుడు ఈ రెండవ స్టేజ్‌లో నేనున్నానేమో అనిపిస్తుంది. ఎవరి కష్టసుఖాలు వారివి కాని, ఇంకొకళ్ళు పాలుపంచుకోగలరంటావా? ఇటువంటి సందేహాలకి సమాధానం దొరకక మనసు భారంగా ఉంటుంది మామయ్యా'' అంది. కేశవ్ వెంటనే ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపు మౌనంగా కూర్చున్నాడు. తరువాత వెళ్ళటానికి లేస్తూ ''ఆదివారం తప్పకుండా రా, అమ్మ గుర్తు చెయ్యమంది'' అన్నాడు.

* * *

ఆరోజు ఆదివారం. రాజేశ్వరిని చూడటానికి పెళ్ళివారు వస్తారు. రాజేశ్వరి అద్దం ముందు నిలబడి జడలు అల్లుకుంటోంది. ఉష దగ్గరే నిలబడి ఉంది. ఉషకి మొదటినుంచీ అలంకరణమీద మోజు. అసలు పెంపకంలోనే రాజేశ్వరికి, ఉషకి తేడా ఉంది. తల్లి కమలమ్మ మొదటినుంచీ రాజేశ్వరి చదువు విషయంలోనూ, పుస్తకాలమీద శ్రద్ధ తీసుకునేది. ఉష తోటి ఆడపిల్లలతో బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తూ, ఆడుకుంటూ తిరిగేది. కొత్తరకం నగ వస్తే వెంటనే ఆవిడ ఉషకి ఆ నగ చేయించేది. అడిగి, పేచీ పెట్టి రకరకాల పరికిణీలు కుట్టించుకునేది ఉష. రాజేశ్వరి తల్లినేమీ అడిగేది కాదు. ఏమీ అనుకునేది కాదు. తాను ఈ కోరికలన్నింటికి అతీతురాలు అన్నట్లు ఉండేది. లైబ్రరీ నుంచి మామయ్య తెచ్చుకున్న ప్రతిపుస్తకం చదివేది. మామయ్యతో సైకిల్ పందాలు వేసేది. సినిమాలకి వెళ్ళటం, క్రికెట్ గురించి చర్చించటం, ఇవి రాజేశ్వరి సరదాలు. ''నేను పెళ్ళి చేసుకోను. డాక్టర్ నవుతాను. స్వతంత్ర జీవనం గడుపుతాను'' అనేది.

ఇవేళ రాజేశ్వరికి అలంకరించుకోవాలని కోరిక పుట్టింది. అలంకరించుకోటానికి సిగ్గుపడుతోంది. తల్లి బలవంతం చేస్తే నగలు

పెట్టుకుందామనుకుంది. కమలమ్మ వచ్చి ఒంటిపేట గొలుసు, గాజులజత ఇస్తూ ''నెక్లెస్ వేసుకోవూ?'' అని అడిగింది. రాజేశ్వరి ''ఊహు'' అంది మనసులో సిగ్గు కోరికను అణిచివేస్తుంటే. ఆగదిలోనే కూర్చున్న కేశవ్‌తో ''దానికి మొదటినుంచీ నగలంటే ఇష్టంలేదు'' అని ముస్తాబవటానికి వెళ్ళిందావిడ. జడలు అల్లుకుంటున్న రాజేశ్వరిని చూసి ''అయితే ఇవేళకూడా మీ మెడికల్ కాలేజి పిల్లలాగే ఉంటావా?'' అని అడిగింది ఉష. ఉష మెడలో నెక్లెస్ అందంగా కనిపిస్తోంది. చెవులకు ముత్యాల దుద్దులు. చేతులకు బంగారు గాజులమధ్య రంగురంగుల గాజులు మెరుపులీనుతున్నాయి. వదులుగా అల్లుకుని వొంకులు తిరిగిన జడలో పువ్వులు నవ్వుతున్నాయి. ఉష ఎంత కళగా ఉంది! ఇదివరకెప్పుడూ చెల్లెలి ముస్తాబుచూసి నవ్వుకునేది రాజేశ్వరి. ఇవేళ తనకేమీ నగలులేవని బాధపడుతోంది. బామ్మ అమ్మతో దెబ్బలాడి తనకు చిన్నప్పుడు చెవులు కుట్టించింది. కాన్వెంట్‌లో జేరాక తను మామయ్య సైకిల్‌మీద కంసాలి దగ్గరకు వెళ్లి చెవుల రింగులు తీయించుకుంది. తర్వాత తనకి అమ్మ ఏ ఆభరణాలూ చేయించలేదు. దానికి రాజేశ్వరి బాధపడలేదుకూడాను. అందరు ఆడపిల్లలలాగ అలంకరించుకుందాము అనే కోరికే ఉండేదికాదు. ఇంటర్ పాసయితే నాన్న వాచ్ కొనిపెట్టారు. ఆ కానుకే తనకి అపరిమితానందం కలుగజేసింది. ఇప్పుడు ఈబాధ ఎందుకూ! చెల్లెలి ప్రశ్నకి జవాబుగా ''నేను నీకంటికి విచిత్రంగా కనిపిస్తానుటే ఉషా?'' అనడిగింది. ''నువ్వు బాగుంటావు, నగలు పెట్టుకుంటే ఎట్లాగుంటావో చూడాలనిపిస్తుంది, రాజక్కా. నీకు నగలంటే చిరాకు'' అంది ఉష.

ఆ మాటలకి రాజేశ్వరి ముఖం చిన్నబోయింది.

బీరువా తెరిచి దంతపుపెట్టి తీసుకువచ్చి ''నేను జూకాలు పెట్టుకుంటాను. నువ్వు నా ముత్యాలదుద్దులు పెట్టుకోవాలి'' అంది ఉష. తన చెవిని తీసి ఇచ్చింది. రాజేశ్వరి వాటివైపు చూసింది. ముత్యాలమధ్య కెంపు మెరుస్తోంది. ముద్దుగా, అందంగా ఉన్నాయి దుద్దులు. అక్క మౌనంగా ఉండటంచూసి, చెవులకు పెట్టడానికి ప్రయత్నించింది ఉష. దుద్దుల కాడలు లావుగా ఉన్నాయి. పట్టలేదు. ''అని పట్టవు ఉషా'' అంది రాజేశ్వరి సన్న గొంతుకతో. ఉష అక్కని పెళ్లివారు చూడటానికి వస్తారు అనే సరదాలో ఉంది. రాజేశ్వరి పరిస్థితి ఏమిటో ఉషకి తెలియదు. ''ఛో, అక్కా చెవికన్నాలు చూడు. ఎంత సన్నగా ఉన్నాయో! నీకు సరదాలేదు, చెవులకేమీ లేకపోతే ఏం బాగుంటుంది, నగలంటే నీకంత అయిష్టమెందుకో నాకు అర్థంకాదు. పోనీ, స్ర్కూట్స్ తెప్పిస్తానుండు'' అని ఉష వెళ్లిపోయింది. అప్పటిదాక అణుచుకున్న ఆవేదన రెండు బిందువులుగా

కనుకొలకుల్లోకి జారింది. ''చెవులకి ముక్కులకు కన్నాలు పొడిపించుకోవట మేమిటని తను క్లాస్‌మేట్స్‌ని వేళాకోళం చేయటం గుర్తు వచ్చింది రాజేశ్వరికి. ఇప్పుడు మెడలో నెక్లెస్ వేసుకోవాలని, చేతులకి రంగురంగుల గాజులు వేసుకోవాలని తల బరువుగా పూలు పెట్టుకోవాలని కోరిక సన్నగా కాటు వేస్తోంది. తను ఇవేళ అమ్మని వాటికోసం అడగలేదు. ఇప్పుడు తను వేసుకున్న బంగారు గాజులజత, ఒంటిపేట గొలుసు, జెడలో గులాబీల జంట తన అభిమానాన్ని ఆక్షేపిస్తున్నాయి.

* * *

ఆరోజు రాజేశ్వరి పుట్టినరోజు. ఇంటికి వచ్చింది. తలంటిపోసుకుని కొత్తచీర కట్టుకుంది. ఉష కాలేజీకి వెళ్లింది. తల్లి పిండివంట చేస్తోంది. రాజేశ్వరి మేడగదిలో ఒంటరిగా వుంది. కిటికీదగ్గర నిలబడి ఆకాశంలోకి చూస్తోంది. ''ఆకాశంలో మేఘాలు కదిలిపోతున్నట్లే తన జీవితంలో సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. తను దేనికోసమో ఎదురుచూస్తోంది. తనకది దూరమైపోతున్నట్లు ఆవేదన అధికమౌతోంది. జీవితంలో వానలేదు, ఎండలేదు. అన్నీ మబ్బులు, మబ్బులు.... తను ఎదురుచూస్తున్నది ఏమిటి?....'' కేశవ్ ఆగదిలోకి వచ్చేదాకా రాజేశ్వరి ఆలోచనలలో చలనరహితంగా అక్కడే నిలబడి వుంది.

''రా మామయ్యా'' అంది కేశవ్‌ని చూసి. కేశవ్ ఒక కుర్చీని రాజేశ్వరి సమీపంలోకి లాక్కుని కూర్చున్నాడు.

''ఇంకా దిగులుగానే కనిపిస్తున్నావ్ రాజూ. ఆ సంబంధం కుదరలేదని నీకు బాధగా ఉన్నట్లుంది'' అన్నాడు తలపైకెత్తిచూస్తూ.

''కట్నాలు, లాంఛనాల దగ్గర భేదం వచ్చి కాదు మామయ్యా. అమ్మాయి నచ్చలేదన్నారుట'' జాలిగా, సన్నగా నవ్వింది రాజేశ్వరి.

''నువ్వు దిగులుపడకు రాజీ. ఈ కారణంగా నువ్వు దిగులుపడటం అనవసరం. ''ఏదో వాళ్ళు రమ్మన్నారని చూడడానికి వెళ్లాం. పెళ్లిచూపులకికూడా నర్సులాగే తయారయింది. మా అమ్మకి నచ్చలేదు. మనిషిలో చలాకీతనం, హుషారు కనిపించవు. మొగరాయుడులా ఉంటుంది. ఆ అమ్మాయి నాకు చాలారోజులనుంచీ తెలుసు. కాబోయే భార్యలో మనం కోరుకునేది ఈ లక్షణాలు కాదు కదా'' అన్నాడుట శంకర్‌తో దీనినిబట్టి నువ్వు అతడిని అర్థం చేసుకుంటావని చెప్తున్నాను. నిన్ను బాధపెట్టాలని కాదు'' అన్నాడు. రాజేశ్వరి ముఖం జేవురించింది. కళ్ళు ఆర్ద్రాలవుతుంటే ముఖాన్ని పక్కకు తిప్పుకుంది.

''అతనిలో బలహీనతలన్నింటినీ సహిద్దామనే అనుకున్నాను. నాపట్ల అతను ఇంత స్నేహరహితంగా ఉంటాడని నేను ఎప్పుడూ భావించలేదు'' అంది.

''శంకర్ వాళ్లింటికి వెళ్ళినప్పుడు ప్రసాద్ తల్లి గోలపెడుతుందిట ఇతనితో, తండ్రి పోయినప్పటినుంచి డబ్బు వ్యవహారాలన్నీ ఇతనే చూస్తున్నాడు. తన సరదాలకు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకుని తల్లి ఏమి అడిగినా వినిపించుకోడట. అతని స్వభావం నాకు నచ్చలేదు రాజీ. ఇప్పుడు చెప్పినా నీకు నామీద కోపంరాదుకదూ'' అన్నాడు నవ్వుతూ. రాజేశ్వరి తల అడ్డంగా వూపుతూ 'లేదం'ది. ఆమె మనసులో భారం తగ్గినట్లు ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది. అతనికి ఫలహారం తెచ్చి పెట్టింది.

ఫలహారం తినటం అయ్యాక ''ఈసారి నీ పుట్టినరోజుకి నేను ఏమి తెచ్చానో తెలుసా?'' అన్నాడు కేశవ్ పాంట్ జేబులో చెయ్యిపెడుతూ. రాజేశ్వరికి పుట్టినరోజునాడు ఒక పుస్తకమేదైనా ఇవ్వటం అతనికి అలవాటు. కాని ఈసారి అతడు ఫాన్సీ షాపుల్లో అమ్మే ముత్యాల దుద్దులు తెచ్చాడు. వాటి ఖరీదు, ఏ రెండు రూపాయలో ఉంటుంది. అంతే. రాజేశ్వరిలో ఆ క్షణం ఆశ్చర్యం, దానివెంట సిగ్గు కలిగాయి.

''నాకెందుకు మామయ్యా, అవి'' అంది అతడి కళ్లలోకి చూస్తూ.

''ప్రపంచంలో ఇన్ని మార్పులు వచ్చాయి కాని స్త్రీ ప్రకృతిలో మార్పు రాలేదు'' అన్నాడు కేశవ్ నవ్వుతూ. తన చేతిలో ఆ వస్తువుల్ని పరీక్షిస్తూ మళ్లీ నవ్వాడు.

''నీ మాట నిజమేనా?'' అని ప్రశ్నిస్తున్నట్లుందా నవ్వు. ''నాదగ్గర నువ్వు ఏమీ దాచలేవు'' అన్నట్లుందతని నవ్వు. కేశవ్ హఠాత్తుగా నవ్వు ఆపి,

''నువ్వు ఇదివరకు రాజువుకాదు, రాజీ'' అన్నాడు కళ్లెత్తి చూస్తూ. రాజేశ్వరి మెల్లగా కనులు వాల్చి అతడి చేతిలోని వస్తువుల్ని తీసుకుంది.

''నాకు పట్టవేమో!'' అంటూనే చెవులకు గట్టిగా గుచ్చింది. వాటికి సన్నటి కాడలు ఉండడంవలన తేలికగా చెవిలోకి దిగింది. రెండు చెవులకీ పెట్టుకున్నాక చెంపలకి రెండు చేతుల్నీ చేర్చుకుని కేశవ్ వైపు నవ్వుతూ చూస్తూ కూర్చుంది.

''బాగున్నాయి'' అన్నాడు కేశవ్ తరవాత కుర్చీలో వెనకని చేరబడి.

''ఆరోజు నీవన్న మాటలు గుర్తున్నాయా? నిజమే. జీవితాన్ని అర్థం చేసుకుంటుంటే సముద్రంలో కొట్టుకుపోతున్నట్లు, శూన్యంలో ఈదుతున్నట్లు

తుఫానులో చిక్కుకున్నట్లు ఉంటుంది. జీవితంలో గమ్యమేమిటో తెలియకుండా నిర్ణయాలు చేసుకుని పొరపాట్లు చేయడం ఆ సమయంలోనే సంభవిస్తుంది. జీవితం చాలా పరిమితమైంది. కనుకనే ఆశయాలతో, సిద్ధాంతాలతో దానిని సుందరతరంగా మలచుకోవాలి. ఈకృషిలోనే తృప్తి, ఆనందం లభిస్తాయి. పొరపాట్లు దిద్దుకోగల అవకాశం జీవితంలో దొరకటం కష్టం. అవసానదశలో మానవుడికి మిగలవలసినది తృప్తితో కూడిన ఆనందం. ఆనందమనేది ఆవేశంలో, తేలికగా లభ్యమయ్యే వస్తువు కాదు. కష్టసాధ్యమైనది. అంతేకాదు, ఒకరి కష్ట సుఖాలలో ఇంకొకరికి పాలు ఉంది. ఎవరి కష్టసుఖాలు వారివే అనుకుని మానవుడు బ్రతుకలేడు. సహజంగా సానుభూతి అనేది మనుషుల్లో ఉంది'' అని కుర్చీలోనుంచి లేస్తూ ''నీకు దిగులు పెట్టుకోవలసిన కారణాలు ఏమీ లేవు. చక్కగా చదువుకో'' అని వెళ్ళిపోయాడు.

తరువాతకూడా రాజేశ్వరి అక్కడనుంచి కదలలేదు. అమ్మకూడా గుర్తించలేని తనలోని మార్పు, దిగులికి కారణం మామయ్య తెలుసుకున్నాడు. ప్రసాదంటే మామయ్యకి ఇష్టంలేదు. తన చేష్టలమీద ఒక కన్ను వేసే ఉంచాడు. ప్రసాద్ ప్రవర్తనని ఎంత నిశితంగా పరిశీలించాడు! తనేదో వ్యామోహంలోపడి మామయ్య చెప్పిన విషయాలను విమర్శించ లేకపోయింది. తను ఎవరిని పెళ్ళి చేసుకుంటే మామయ్యకేమిటి? నామీద ఎందుకతనికంత వాత్సల్యం? ఇదివరకటి మామయ్యేనా ఈ మామయ్య. నువ్వు పూర్వపు రాజువు కాదు రాజీ అన్నాడు. అతడు నాలో కొత్తగా మొలకెత్తుతున్న కోరికల్ని స్త్రీ సహజమైన వాంఛల్ని గుర్తించాడన్నమాట. ఇదివరకు ఎప్పుడూ నేను మామయ్యనిట్లాగ అర్థం చేసుకోలేదు'' అనుకుంది.

గదిలోకి చీకటులు వస్తున్నాయి. అప్పుడు లేచి లైటువేసి ఉత్తరం వ్రాయటం మొదలుపెట్టింది.

''నువ్వు ఇదివరకులాగ ఒక స్నేహితుడివిగాకాక కొత్తరకంగా అర్థమయ్యావు మామయ్యా. నీకు నామీద ఎంత వాత్సల్యం! కాని నామనసిప్పుడు పూర్తిగా పరిణతిపొందే యువతి మనసులా ఉంది. అబ్బాయి వేషాలు వేసే అల్లరిపిల్లలాగ కాదు. కనుక నా మనసులో అంతా నువ్వే నిండిపోయావు. నేను ఆవేశంలో రాయటంలేదు. నీవు నన్ను అర్థం చేసుకున్నావు. నువ్వు వెళ్లాక రెండుగంటల వరకూ నేను ఆ కుర్చీలోంచి లేవలేకపోయాను. నేను నిన్ను అర్థం చేసుకోవటం ఆశ్చర్యం, సంభ్రమం

కలిగించింది. ఒకరు నామనసులో నిండిపోవటం ఇంత ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుందా! ఇంత బలాన్ని ఇస్తుందా? నామీద నీకింత వాత్సల్యం, అభిమానం ఉన్నాయని నేను ఊహించలేదు, ఈ క్షణం వరకూ. అది తెలిశాక నేనెంత అదృష్టవంతురాలనో అర్ధమయింది. నాకింక దిగులులేదు, మామయ్యా. నేను మెడిసిన్ పూర్తిచేస్తాను.

నీ

రాజి

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

2-11-1960

* * * *